

PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

జర్నలిస్ట్ శక్తి ప్రజల పక్షం
జర్నలిస్ట్ సంక్షేమం లక్ష్యం
TJWA
Regd. No: 288/2026
తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్
తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం
జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ – సంక్షేమమే మా ధ్యేయం

ఆదివారం 01 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 . సంచిక : 151 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

ఎన్‌వీఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతం.. ఇస్రో శాస్త్రవేత్తలకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు



హైదరాబాద్, అక్టోబర్ 31 – భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన మరో ప్రతిష్టాత్మక అంతరిక్ష ప్రయోగం విజయవంతమైంది. జీఎస్ఎల్వీ-ఎఫ్18 (GSLV-F18) రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-03 (NVS-03) నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించి నిర్దేశిత జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టడంతో భారత అంతరిక్ష, స్వదేశీ నావిగేషన్ రంగాల్లో మరో కీలక ముందడుగు పడింది.

ఈ విజయంపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడం భారత నావిగేషన్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే ముఖ్యమైన మైలురాయి అని సీఎం ప్రశంసించారు. ఎన్‌వీఎస్-03 ఉపగ్రహం ద్వారా రవాణా వ్యవస్థ, విమానయానం, సముద్ర నౌకల నావిగేషన్, పర్యవేక్షణ, అత్యవసర సేవలు తదితర కీలక రంగాల్లో మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ విజయం యావత్ భారతదేశానికి గర్వకారణమని, భవిష్యత్తులో ఇస్రో మరిన్ని చారిత్రాత్మక విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కాగా, అక్టోబర్ 30వ తేదీ రాత్రి 11.51 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. సుమారు 18 నిమిషాల ప్రయాణం అనంతరం 2,232 కిలోల బరువున్న ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని నిర్దేశిత బదిలీ కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగం భారత జీఎస్ఎల్వీ రాకెట్‌కు 20వ ప్రయోగం కావడం విశేషం. ఎన్‌వీఎస్-03 ఉపగ్రహం భారతదేశ స్వదేశీ ప్రాంతీయ ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ 'నావిక్' (NavIC – Navigation with Indian Constellation) సామర్థ్యాలను మరింత పెంచేందుకు రూపొందించిన రెండో తరం ఉపగ్రహ శ్రేణిలో మూడవది. ఇందులో స్వదేశీంగా అభివృద్ధి చేసిన రూబిడియం అటామిక్ క్లాక్‌తో పాటు ఇతర అటామిక్ క్లాక్‌లను అమర్చారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎల్5, ఎస్-బ్యాండ్ సంకేతాలతో పాటు అదనంగా ఎల్1 ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌ను కూడా ప్రవేశపెట్టడం ఈ ఉపగ్రహ ప్రత్యేకత. నావిక్ వ్యవస్థ ద్వారా భారత భూభాగంతో పాటు దేశ సరిహద్దుల నుంచి సుమారు 1,500 కిలోమీటర్ల పరిధి వరకు స్థాన నిర్ధారణ, దిశానిర్దేశం, ఖచ్చితమైన సమయ సేవలు అందించేందుకు వీలుంటుంది. రైళ్లు, వాహనాలు, నౌకల రియల్‌టైమ్ ట్రాకింగ్‌తో పాటు పౌర, వాణిజ్య, వ్యూహాత్మక అవసరాలకు ఈ వ్యవస్థ ఉపయోగపడనుంది. ఈ ప్రయోగంతో భారతదేశ స్వతంత్ర నావిగేషన్ వ్యవస్థ నావిక్ కనీస కార్యాచరణకు అవసరమైన నాలుగు ఉపగ్రహాల స్థాయికి తిరిగి చేరుకోవడం మరో కీలక పరిణామంగా నిలిచింది. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా ఈ ప్రయోగం భారత్‌కు మరింత బలాన్ని చేకూర్చనుంది.



అర్బన్ నక్సలిజాన్ని కూడా అంతం చేస్తాం.. ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

ఏక్తానగర్, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: దేశంలో సాయుధ నక్సలిజం ప్రభావాన్ని పూర్తిగా తగ్గించామని, అర్బన్ నక్సలిజం ముప్పును కూడా ఎదుర్కొంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో నిర్వహించిన జాతీయ ఐక్యత దివస్ (రాష్ట్రీయ ఏక్తా దివస్) వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత ఏడాది ఇదే వేదికపై దేశాన్ని నక్సలిజం, మావోయిస్టు హింస నుంచి విముక్తి చేసే వరకు విశ్రమించబోమని ఇచ్చిన పిలుపును గుర్తుచేస్తూ, ఆ లక్ష్యం దిశగా దేశం కీలక పురోగతి సాధించిందని పేర్కొన్నారు. 2015లో దేశవ్యాప్తంగా 126 జిల్లాలు వామపక్ష తీవ్రవాద ప్రభావానికి గురయ్యాయని, 2026 మార్చి నాటికి నక్సలిజం ప్రభావిత జిల్లాలు ఏవీ మిగలలేదని ప్రధాని వెల్లడించారు. నక్సలిజం వెన్నెముక విరిచామని, గతంలో హింస, భయాందోళనలతో సతమతమైన ప్రాంతాల్లో ప్రస్తుతం అభివృద్ధి కార్యక్రమాలు వేగం పుంజుకుంటున్నాయని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, మొబైల్ కనెక్టివిటీ, విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపడుతున్నాయని, యువతకు విద్య, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని వివరించారు. నక్సలిజం వ్యతిరేక పోరాటంలో ప్రాణత్యాగం చేసిన భద్రతా బలగాల సిబ్బందికి నివాళులర్పించారు. అయితే సాయుధ నక్సలిజం తగ్గినప్పటికీ, తాను 'దిమాగీ నక్సలిజం'గా అభివర్ణించిన మేధోపరమైన నక్సలిజం ముప్పు ఇంకా ఉందని, సమాజాన్ని అప్రమత్తంగా ఉంచాల్సిన అవసరం ఉందని ప్రధాని పేర్కొన్నారు. సోషల్ మీడియాను ఉపయోగించి పుకార్లు వ్యాప్తి చేయడం, దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దేశ ఐక్యతను బలహీనపరిచే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమైక్యత కోసం చేసిన కృషిని స్మరించుకుంటూ, 550కు పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో ఆయన పోషించిన పాత్రను కొనియాడారు. 'ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్', 'వికసిత్ భారత్' లక్ష్యాల సాధనకు జాతీయ ఐక్యత ఎంతో అవసరమని పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన, సుస్థిరమైన, శక్తిమంతమైన భారతదేశాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల పోలీసు బలగాలు, కేంద్ర సాయుధ పోలీసు దళాలు పాల్గొనగా, నక్సలిజం ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చిన కుటుంబాలు కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా వేడుకల్లో పాల్గొన్నాయి.

ఇందిరా గాంధీకి సీఎం రేవంత్ రెడ్డి ఘన నివాళులు



న్యూఢిల్లీ, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న శ్రీమతి ఇందిరా గాంధీ 42వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి న్యూఢిల్లీలోని ఆమె సమాధి స్థలం 'శక్తి స్థల్' వద్ద పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలను, జాతీయ సమైక్యత, సమగ్రత పరిరక్షణకు చేసిన కృషిని ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ఆమె తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని పేర్కొన్నారు. బ్యాంకుల జాతీయీకరణ, పేదరిక నిర్మూలన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి వంటి అంశాలకు ఆమె పాలనలో ప్రాధాన్యత లభించిందని గుర్తుచేశారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కాగా, ఇందిరా గాంధీ 1984 అక్టోబర్ 31న హత్యకు గురయ్యారు. ఆమె స్మారకార్థం ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న దేశవ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తూ నివాళులర్పిస్తారు.

దేశ ప్రజలను విభజించేందుకు కుట్రలు జరుగుతున్నాయి.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ప్రధాని మోదీ

ఏక్తానగర్, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: దేశ ప్రజల మధ్య విభేదాలు సృష్టించి జాతీయ ఐక్యతను దెబ్బతీసేందుకు కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. రాజకీయ నిరాశ, నిస్పృహలతో ప్రతిపక్షాలు దేశ అభివృద్ధి ప్రయాణానికి అడ్డంకులు సృష్టిస్తున్నాయని విమర్శించారు. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా శనివారం నిర్వహించిన జాతీయ ఐక్యత దివస్ (రాష్ట్రీయ ఏక్తా దివస్) వేడుకల్లో పాల్గొన్న ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కొన్ని శక్తులు నిరంతరం విభజన రాజకీయాలకు పాల్పడుతున్నాయని, ప్రజల మధ్య పరస్పర విరోధాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ఒక దశాబ్దానికి పైగా రాజకీయ నిరాశ, అసంతృప్తితో ఉన్న కొందరు ఇప్పుడు బహిరంగంగా దేశ ఐక్యతకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. విదేశాల్లో భారత్ వ్యతిరేక శక్తులతో రహస్యంగా ఎవరు సమావేశమవుతున్నారు? ఆ శక్తులు ఎవరికి మద్దతు ఇస్తున్నాయి? దేశ శత్రువుల భాషలో ఎవరు మాట్లాడుతున్నారు? అనే అంశాలను ప్రజలు గమనించాలని పరోక్షంగా ప్రతిపక్ష నేతలను ఉద్దేశించి ప్రశ్నించారు. ఇలాంటి పరిణామాలను గుర్తించి, దేశాన్ని విభజించేందుకు ప్రయత్నించే శక్తులను ఎదుర్కొనేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాల బాధ్యత ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను లేవనెత్తడమేనని, అయితే అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టించడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షం 'విరోధ్ పక్ష్'గా కాకుండా 'అవరోధ్ పక్ష్'గా మారిందని విమర్శించారు. సామాజిక మాధ్యమాలను కొందరు తప్పుడు ప్రచారం, వుకార్ల వ్యాప్తికి ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారని, తద్వారా దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితి, ఇంధన సంక్షోభం వంటి సవాళ్లు ఎదురవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశానికి జాతీయ ఐక్యతే అతిపెద్ద బలమని ప్రధాని పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన ఐక్యతా మార్గంలో పయనిస్తూ 'ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్', 'వికసిత్ భారత్' లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ సరిహద్దుల భద్రత, చొరబాట్ల నియంత్రణ, జాతీయ సమగ్రత పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పోలీసు, కేంద్ర సాయుధ బలగాల సిబ్బంది పాల్గొన్నారు. సర్దార్ పటేల్ ఆశయాలకు అనుగుణంగా దేశ ఐక్యతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ప్రధాని తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

బాలికల విద్యపై జాకీర్ నాయక్ వ్యాఖ్యలు.. అంతర్జాతీయంగా విమర్శలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: అఫ్గానిస్థాన్‌లో బాలికల ఉన్నత విద్యపై తాలిబన్లు విధించిన ఆంక్షలను సమర్థిస్తూ ప్రముఖ ఇస్లామిక్ మత బోధకుడు జాకీర్ నాయక్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. బాలికల విద్యను పూర్తిగా నిషేధించలేదని, భద్రతా పరిస్థితులు మెరుగుపడే వరకు మాత్రమే వాయిదా వేశారని ఆయన పేర్కొనడం వివాదానికి కారణమైంది. సరైన భద్రతా వాతావరణం, మహిళా ఉపాధ్యాయుల కొరత వంటి కారణాలతో బాలికలకు ఆరో తరగతి తర్వాత విద్యను నిలిపివేశారని, పరిస్థితులు అనుకూలించిన తర్వాత తిరిగి విద్యను కొనసాగించే అవకాశం ఉంటుందని ఆయన తన వ్యాఖ్యల్లో సమర్థించారు. అయితే తాలిబన్ల ఆంక్షలను కేవలం వాయిదాగా పేర్కొనడం ద్వారా బాలికల విద్యాహక్కును నిరాకరించే చర్యలను సమర్థించినట్లవుతుందని పలువురు విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యూసఫ్‌జాయ్ తండ్రి జియావుద్దీన్ యూసఫ్‌జాయ్ జాకీర్ నాయక్ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. బాలికల విద్యపై నిరవధికంగా కొనసాగుతున్న నిషేధాన్ని కేవలం వాయిదాగా అభివర్ణించడం సమర్థనీయం కాదని, మహిళా ఉపాధ్యాయుల కొరతను కారణంగా చూపుతూ సమస్యను పక్కదారి పట్టించడం సరికాదని విమర్శించారు. అఫ్గానిస్థాన్ పార్లమెంట్ మాజీ సభ్యురాలు మరియం సోలైమాన్‌ఖిల్ నైతం వ్యంగ్యంగా స్పందిస్తూ, బాలికలకు మహిళా ఉపాధ్యాయులు లేరని చెబుతున్నారని, అయితే మహిళా ఉపాధ్యాయులే పనిచేయకుండా ఆంక్షలు విధించినప్పుడు ఆ కొరత ఎలా తీరుతుందని ప్రశ్నించారు. భారత చరిత్రకారిణి రుచికా శర్మ కూడా ఈ అంశంపై స్పందిస్తూ, బాలికల విద్యాహక్కును హరించే చర్యలను మతపరమైన ప్రభావం కలిగిన వ్యక్తులు ఖండించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, అఫ్గానిస్థాన్‌లో బాలికల విద్యపై ఆంక్షల తీవ్రతను ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల సంస్థ యునిసెఫ్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2021 సెప్టెంబర్ నుంచి తాలిబన్ల ఆంక్షల కారణంగా 2.6 మిలియన్లకు పైగా బాలికలు సెకండరీ విద్యకు దూరమైనట్లు యునిసెఫ్ వెల్లడించింది. ఆరో తరగతి తర్వాత బాలికలకు పాఠశాల విద్య నిలిపివేయడంతో పాటు 2022 డిసెంబర్ నుంచి మహిళలకు విశ్వవిద్యాలయ విద్యను కూడా నిషేధించారు. ప్రస్తుతం బాలికలు, మహిళలకు సెకండరీ, ఉన్నత విద్య అందుబాటులో లేని ఏకైక దేశంగా అఫ్గానిస్థాన్ కొనసాగుతోందని యునిసెఫ్ పేర్కొంది. విద్య అనేది ప్రతి బాలిక ప్రాథమిక హక్కు కాగా, భద్రత లేదా ఇతర కారణాలతో ఆ హక్కును నిరవధికంగా నిరాకరించడం వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందనే ఆందోళనలు అంతర్జాతీయంగా వ్యక్తమవుతున్నాయి. జాకీర్ నాయక్ వ్యాఖ్యలతో అఫ్గాన్ బాలికల విద్యాహక్కు అంశం మరోసారి అంతర్జాతీయ చర్చకు కేంద్రంగా మారింది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి: బీసీ సంఘాల డిమాండ్



హుజూర్‌నగర్, అక్టోబర్ 31 - సందేశం టైమ్స్ ప్రతినిధి:.రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు తగిన ప్రాధాన్యతనిస్తూ ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం హుజూర్‌నగర్లోని పద్మశాలి భవన్లో ధూళిపాల శ్రీనివాస్ అధ్వర్యంలో బీసీ సంఘాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో సుమారు 52 శాతం ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఎన్నికల్లో కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే బీసీలను పరిగణించకుండా, చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు అన్ని పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బీసీ వర్గాలకు విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని, అయా కులాల అభ్యున్నతికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ కులాల మధ్య ఐక్యత మరింత బలోపేతం కావాలని, హక్కుల సాధన కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం సంఘాలు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయపడ్డారు.

తెలంగాణలో ప్రతి గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక.. జీపీఎస్ఏపీ–2026 అమలుకు ఉత్తర్వులు

హైదరాబాద్, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణలోని ప్రతి గ్రామపంచాయతీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి స్వయం సమృద్ధి దిశగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. దేశంలోనే తొలిసారిగా ప్రతి గ్రామపంచాయతీకి సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించి అమలు చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీపీఎస్ఏపీ–2026 పేరుతో ప్రత్యేక విధానాన్ని ప్రవేశపెట్టి ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) ఆలోచనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామానికి సమగ్ర వివరాలతో ప్రత్యేక గ్రామ ప్రొఫైల్‌ను సిద్ధం చేయనున్నారు. గ్రామంలోని జనాభా, కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిగతులు, ఉపాధి అవకాశాలు, గృహవసతి, భూమిలేని నిరుపేద కుటుంబాలు, పశుసంపద, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారి వివరాలను సేకరించనున్నారు. ఈ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ప్రతి గ్రామపంచాయతీకి రాబోయే మూడు నుంచి ఐదేళ్లకు సంబంధించిన దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికతో పాటు ప్రతి ఆర్థిక సంవత్సరానికి ప్రత్యేక వార్షిక కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, ప్రజల అవసరాలు, స్థానిక ప్రాధాన్యతలను గుర్తించి రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాల కల్పన వంటి అభివృద్ధి పనులను ఎంపిక చేస్తారు. ఆయా పనులను వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో అమలు చేసి, అందుబాటులో ఉన్న నిధులు, వనరులను సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపడతారు. గ్రామాభివృద్ధి పనుల్లో పారదర్శకత పెంచేందుకు ప్రతి గ్రామపంచాయతీకి ప్రత్యేక అంతర్జాల వేదికను ఏర్పాటు చేయనున్నారు. అలాగే అభివృద్ధి పనుల పురోగతి, అమలు స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక సమాచార పర్యవేక్షణ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రతి నెలా నిర్వహించే గ్రామపంచాయతీ సమావేశంలో ఈ ప్రణాళిక అమలు, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తారు. గ్రామస్థాయిలో సమాచార సేకరణ నుంచి జిల్లా స్థాయి పర్యవేక్షణ వరకు అధికారుల బాధ్యతలను నిర్దేశించారు. అవసరమైన వివరాలను అందించడంలో నిర్లక్ష్యం వహించినా, ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం సమర్పించినా పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ స్థాయి అధికారుల వరకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. తెలంగాణ రైజింగ్–2047 లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధిని వేగవంతం చేయడం, ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయం పెంచడం, ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడం ఈ ప్రణాళిక ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం పేర్కొంది. ప్రతి గ్రామంలోని అవసరాలను గుర్తించి, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాలను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దేందుకు జీపీఎస్ఏపీ–2026 దోహదపడనుంది.

రాత్రి 11 నుంచి ఉదయం 5 వరకు రైళ్లలో మొబైల్ ఛార్జింగ్ నిలిపివేత

న్యూఢిల్లీ, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: రైలు ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ భారత రైల్వే బోర్డు కీలక ఆదేశాలు జారీ చేసింది. రైలు బోగీల్లో ఏర్పాటు చేసిన మొబైల్ ఛార్జింగ్ సదుపాయాలను ప్రతి రోజు రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు తప్పనిసరిగా నిలిపివేయాలని అన్ని జోనల్ రైల్వేలకు స్పష్టం చేసింది. ఈ మేరకు రైల్వే బోర్డు అక్టోబర్ 26, 2026న ఉత్తర్వులు జారీ చేస్తూ, గతంలో 2014 జూన్ 19న ఇచ్చిన ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది. ఇటీవల దక్షిణ తూర్పు రైల్వే పరిధిలో చోటుచేసుకున్న ఘటన ఈ నిర్ణయాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చింది. రాత్రి వేళ విధుల్లో ఉన్న రైల్వే సిబ్బంది బోగీల్లోని ఛార్జింగ్ పాయింట్లను నిలిపివేయకపోవడంతో, ప్రయాణికుడు ఛార్జింగ్‌కు పెట్టిన విద్యుత్ నిల్వ పరికరం (పవర్ బ్యాంక్) పేలి పొగలు వెలువడ్డాయి. ఈ ఘటన ప్రయాణికుల భద్రతపై ఆందోళన కలిగించడంతో రైల్వే బోర్డు పాత నిబంధనలను కఠినంగా అమలు చేయాలని నిర్ణయించింది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ బోగీల్లోని మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు పనిచేయకూడదని, ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు అనుమతించబోమని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అన్ని జోనల్ రైల్వేల్లో సంబంధిత అధికారులు ఈ ఆదేశాలను సిబ్బందికి తెలియజేయడంతో పాటు, వాటి అమలుపై పూర్తి బాధ్యత వహించాలని సూచించింది. ఛార్జింగ్ పాయింట్లను నిర్దిష్ట సమయానికి నిలిపివేయడం, తిరిగి ఉదయం 5 గంటల తర్వాత అందుబాటులోకి తీసుకురావడం వంటి విధులను నిర్వహించే సిబ్బందికి తగిన అవగాహన, సూచనలు, శిక్షణ అందించాలని పేర్కొంది. అంతేకాకుండా అధికారులు, పర్యవేక్షకులు ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలు కఠినంగా అమలవుతున్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించింది. ప్రయాణికులు కూడా రైల్వే భద్రతా నిబంధనలకు సహకరించాలని, నిర్దిష్ట సమయాల్లో బోగీల్లోని ఛార్జింగ్ పాయింట్లను ఉపయోగించకుండా జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్ నిల్వ పరికరాలు, మొబైల్ ఫోన్ల ఛార్జింగ్ విషయంలో నిర్లక్ష్యం చేయకుండా ఉండటం అవసరం. రైలు ప్రయాణంలో అగ్నిప్రమాదాలు, విద్యుత్ సంబంధిత ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణ అనుభవాన్ని కల్పించడమే ఈ ఆదేశాల ప్రధాన ఉద్దేశమని రైల్వే బోర్డు స్పష్టం చేసింది.

ఇంటర్నెట్ డేటా లేకుండానే కాలింగ్.. కొత్త రీఛార్జ్ ప్లాన్లతో టెలికాం సంస్థలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: మొబైల్ ఫోన్‌లో ఇంటర్నెట్ డేటా అవసరం లేకుండా కేవలం ఫోన్ కాల్స్, సంక్షిప్త సందేశాల సేవలు మాత్రమే వినియోగించుకునే వారికి టెలికాం సంస్థలు ప్రత్యేక రీఛార్జ్ అవకాశాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. ఇంట్లో లేదా కార్యాలయాల్లో వైఫై సదుపాయం ఉపయోగించుకునేవారు, సాధారణ ఫీచర్ ఫోన్లు వాడేవారు, రెండో సిమ్ కలిగి ఉన్నవారు, వృద్ధులు, ఇంటర్నెట్ వినియోగం తక్కువగా ఉండే వినియోగదారులకు ఈ ప్లాన్లు ప్రయోజనకరంగా మారనున్నాయి. డేటా అవసరం లేకపోయినా తప్పనిసరిగా డేటా కలిగిన ప్లాన్లకు రీఛార్జ్ చేయాల్సిన పరిస్థితిని తగ్గించేందుకు భారత టెలికాం నియంత్రణ సంస్థ కొత్త మార్గదర్శకాలను తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో వీఐ సంస్థ అక్టోబర్ 30న నాలుగు ప్రత్యేక వాయిస్ ఆధారిత రీఛార్జ్ ప్లాన్లను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో రూ.179 ప్లాన్‌తో 25 రోజుల పాటు అపరిమిత కాలింగ్ సదుపాయం, 300 సందేశాలు, వినోద సేవలకు సంబంధించిన అదనపు ప్రయోజనం లభిస్తాయి. రూ.185 ప్లాన్‌తో 28 రోజుల పాటు అపరిమిత కాల్స్, 300 సందేశాలు, రూ.203 ప్లాన్‌తో 30 రోజుల పాటు అపరిమిత కాల్స్, 300 సందేశాలు, రూ.206 ప్లాన్‌తో ఒక క్యాలెండర్ నెల పాటు అపరిమిత కాల్స్, 300 సందేశాలు పొందవచ్చు. ఈ ప్లాన్లలో మొబైల్ ఇంటర్నెట్ డేటా ఉండదు. మరోవైపు ఎయిర్‌టెల్ ఇప్పటికే రూ.185, రూ.203, రూ.206 ధరలతో మూడు వాయిస్ ఆధారిత ప్లాన్లను ప్రవేశపెట్టింది. రూ.185తో 28 రోజులు, రూ.203తో 30 రోజులు, రూ.206తో ఒక క్యాలెండర్ నెల పాటు అపరిమిత స్థానిక, ఎస్‌టీడీ, రోమింగ్ కాల్స్‌తో పాటు 300 సందేశాలు అందిస్తోంది. ఈ ప్లాన్లలోనూ డేటా సదుపాయం ఉండదు. జియో విషయానికి వస్తే, ప్రస్తుతం అందుబాటులో ఉన్న దీర్ఘకాలిక వాయిస్, సందేశాల ప్లాన్లలో రూ.448తో 84 రోజులు, రూ.1,748తో 336 రోజుల పాటు సేవలు పొందే అవకాశం ఉంది. అయితే వీఐ, ఎయిర్‌టెల్ ప్రవేశపెట్టిన తరహాలో రూ.185 నుంచి ప్రారంభమయ్యే స్వల్పకాలిక ప్లాన్లు జియోలో అందుబాటులోకి వచ్చినట్లు అక్టోబర్ 30 నాటికి సమాచారం లేదు. బీఎస్ఎన్ఎల్ విషయానికి వస్తే, తాజా స్వల్పకాలిక వాయిస్ ఆధారిత ప్లాన్ల ధరలు, ప్రయోజనాలపై స్పష్టమైన ధృవీకరించిన వివరాలు అందుబాటులో లేవు. వినియోగదారులు తమ ప్రాంతానికి వర్తించే ప్రస్తుత రీఛార్జ్ వివరాలను సంస్థ అధికారిక సేవా కేంద్రాల్లో లేదా అనువర్తనాల్లో పరిశీలించుకోవాలి. కాగా, భారత టెలికాం నియంత్రణ సంస్థ తీసుకొచ్చిన కొత్త నిబంధనల ప్రకారం, డేటా అవసరం లేని వినియోగదారులకు కేవలం కాలింగ్, సందేశాల సేవలతో కూడిన ప్రత్యేక రీఛార్జ్ అవకాశాలను అందించడంతో పాటు, నెలవారీగా ఒకే తేదీన పునరుద్ధరించుకునే సదుపాయాన్ని కూడా కల్పించాల్సి ఉంటుంది. ఈ మార్పుల ప్రధాన ఉద్దేశం వినియోగదారులు తమకు అవసరం లేని ఇంటర్నెట్ డేటా కోసం అదనపు మొత్తం చెల్లించకుండా, అవసరమైన సేవలకే రీఛార్జ్ చేసుకునే అవకాశం కల్పించడం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వినియోగదారులు, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు, వృద్ధులు, సాధారణ ఫోన్ వినియోగదారులకు ఈ విధానం కొంత ఆర్థిక ఉపశమనం కలిగించే అవకాశం ఉంది.

మూడు రోజుల పాటు వరి కోతలు వాయిదా వేసుకోండి.. రైతులకు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచన



సూర్యాపేట, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆర్నాబ్ తుఫాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తగా మూడు రోజుల పాటు వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. ఇప్పటికే వరి కోతలు పూర్తిచేసి ధాన్యాన్ని పొలాల్లో లేదా కొనుగోలు కేంద్రాలకు తరలించే మార్గాల్లో ఉంచిన రైతులు వర్షానికి ధాన్యం తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ధాన్యాన్ని టార్పాలిన్లు, ఇతర కవర్లతో పూర్తిగా కప్పి, నీరు చేరని సురక్షిత ప్రదేశాల్లో భద్రపరచుకోవాలని సూచించారు. వర్షం కారణంగా ధాన్యంలో తేమ శాతం పెరిగి నాణ్యత తగ్గడంతో పాటు కొనుగోలు సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, తద్వారా రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకు పంట కోతలను నిలిపివేయాలని, కోసిన ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వర్షపు నీటికి గురికాకుండా చూసుకోవాలని తెలిపారు. రైతులు వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. పంటను కాపాడుకోవడానికి ముందస్తు జాగ్రత్తలే ముఖ్యమని, రైతులు నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా వ్యవహరించి ధాన్యం నష్టపోకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



మియాపూర్ 550 ఎకరాల భూములు ప్రభుత్వానివే.. ప్రజాప్రయోజనాలకే వినియోగిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలో ఉన్న 550.39 ఎకరాల విలువైన భూములు రాష్ట్ర ప్రభుత్వానికే చెందుతాయని సుప్రీంకోర్టు తుది తీర్పు వెలువరించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ భూములను గతంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు, వారి అనుచరులు ప్రయత్నించారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన బంధువులు, గోల్డ్‌స్టోన్ ప్రసాదరావు తదితరుల పేర్లను ప్రస్తావిస్తూ భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడేందుకు ప్రయత్నాలు జరిగాయని విమర్శించారు. ఈ వ్యవహారంలోనే బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు దామోదరరావుకు ఖరీదైన కారు బహుమతిగా ఇచ్చారన్న ఆరోపణను కూడా సీఎం ప్రస్తావించారు. కొందరు అధికారులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వ భూములను సొంతం చేసుకునేందుకు ప్రయత్నించారని, ఈ వివాదానికి సంబంధించి పలువురు అధికారులు కూడా అరెస్టయ్యారని తెలిపారు. గతంలో తాను ఎంపీగా ఉన్న సమయంలో భూకబ్జాల వ్యవహారాలపై పోరాటం చేసినందుకు రాజకీయ కక్షతో తనను జైలుకు పంపించారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మియాపూర్ భూముల వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి సారించి సుప్రీంకోర్టులో బలమైన న్యాయవాదనలు వినిపించిందని, సుమారు రూ.50 వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని కాపాడుకోగలిగామని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అవసరమైతే ఈ భూములను వేలం వేసి, తద్వారా వచ్చే ఆదాయాన్ని దళితులు, బహుజనులు, పేదల సంక్షేమంతో పాటు విద్య, వైద్యం, సాగునీటి ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. ఈ ప్రతిపాదనను మంత్రివర్గంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడినట్లు సీఎం తెలిపారు. కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాలు, మామిడిపల్లిలోని భూములు, గుర్రంగూడలోని అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాల భూముల పరిరక్షణకు న్యాయపోరాటం చేసినట్లు వివరించారు. మంచిరేవుల భూముల్లో కొంత భాగంలో పోలీసు పిల్లల కోసం పాఠశాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 400 ఎకరాల అటవీ భూమిని కూడా పరిరక్షించినట్లు పేర్కొన్నారు. ఎల్బీనగర్ పరిధిలో 150 ఎకరాలను అటవీ ప్రాంతంగా మార్చినట్లు చెప్పారు. మాజీ మంత్రి హరీశ్‌రావు బంధువులకు సంబంధించిన భూముల విషయంలోనూ ఆక్రమణ ఆరోపణలు ఉన్నాయని, వాటిపై అధికారులు సర్వే చేయకుండా అడ్డంకులు ఎదురవుతున్నాయని సీఎం విమర్శించారు. సంబంధిత వ్యక్తులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి నిలుపుదల ఉత్తర్వులు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూముల వ్యవహారాలను ప్రస్తావిస్తూ, గతంలో కేసులు వేసిన నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ భూముల విషయంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. భూ ఆక్రమణల అంశంపై శాసనసభలో చర్చించేందుకు బీఆర్ఎస్ నాయకులు ముందుకు రావాలని సవాల్ విసిరారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండబడని, ప్రజలకు చెందాల్సిన ఆస్తులను కాపాడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలోని భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సదరు భూములు హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ అధీనంలో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే సుమారు 400 ఎకరాలకు కంచె ఏర్పాటు చేశామని, మిగిలిన భూములకు కూడా త్వరలో కంచె నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉన్న ఈ భూములు 1949లోనే జాగీర్దార్ నుంచి ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చాయని వివరించారు. 1995 నుంచి వివాదం కొనసాగగా, సుమారు 23 ఏళ్లపాటు న్యాయస్థానాల్లో విచారణ జరిగిందని తెలిపారు. సంబంధిత చారిత్రక రెవెన్యూ రికార్డులు, ఇతర ఆధారాలను న్యాయస్థానానికి సమర్పించడం వల్ల ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని పేర్కొన్నారు. సర్వే నంబర్ల పరిధిలో ఇప్పటికే ఉన్న నిర్మాణాల విషయంలో ప్రస్తుతం జోక్యం చేసుకోవడం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వ భూముల యాజమాన్య హక్కుపై స్పష్టత వచ్చిన నేపథ్యంలో వాటిని పరిరక్షించడం, భవిష్యత్తులో ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా వినియోగించడంపై ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టనుంది.



కేసీఆర్ హయాంలో కాపాడిన మియాపూర్ భూములను అమ్మేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది: హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూముల పరిరక్షణకు న్యాయపోరాటం ప్రారంభించి, సుప్రీంకోర్టులో కీలకమైన న్యాయపరమైన ఆధారాలను సమర్పించింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నేతృత్వంలోని ప్రభుత్వం ఎనిమిదేళ్లపాటు సాగించిన న్యాయపోరాట ఫలితంగానే ప్రస్తుతం ప్రభుత్వానికి అనుకూలంగా తుది తీర్పు వచ్చిందని వెల్లడించారు. మియాపూర్ భూ వివాదంపై సుప్రీంకోర్టులో ప్రభుత్వ తరఫున వాదనలు వినిపించేందుకు దేశంలోని ప్రముఖ న్యాయవాదుల్లో ఒకరైన సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్‌ను 2015లో కేసీఆర్ ప్రభుత్వం నియమించిందని తెలిపారు. 2015 ఏప్రిల్ 7 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ భూముల పరిరక్షణ కోసం నిరంతర న్యాయపోరాటం కొనసాగించిందని పేర్కొన్నారు. 2023 జూన్ 15న సుప్రీంకోర్టు వెలువరించిన ట్రినిటీ ఇన్‌ఫ్రావెంచర్స్ కేసు తీర్పు కూడా ప్రభుత్వ భూముల హక్కులకు సంబంధించిన చట్టపరమైన అంశాలను స్పష్టం చేసిందని, ఆ తీర్పులోని న్యాయసూత్రాలు ప్రస్తుత మియాపూర్ భూముల కేసులోనూ ప్రస్తావనకు వచ్చాయని వివరించారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన న్యాయపరమైన విజయాలు, సమర్పించిన రికార్డులు ప్రస్తుత తుది తీర్పునకు బలమైన ఆధారాలుగా నిలిచాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ వివరాలన్నీ సుప్రీంకోర్టు న్యాయస్థాన రికార్డుల్లో అందుబాటులో ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ఈ విజయం తమ ప్రభుత్వ కృషి వల్లే సాధ్యమైనట్లు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం కాపాడిన ప్రభుత్వ భూములను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విక్రయించి ఆదాయం సమకూర్చుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ప్రజలకు చెందాల్సిన విలువైన భూములను అమ్మాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మియాపూర్ భూముల వ్యవహారంలో గత ప్రభుత్వ న్యాయపోరాటం, ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత ఉందని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీలేని పోరాటం



హైదరాబాద్, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎలాంటి రాజీ లేకుండా ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కంచె గచ్చిబౌలి నుంచి మియాపూర్ వరకు విలువైన ప్రభుత్వ భూములకు సంబంధించిన వివాదాల్లో సుప్రీంకోర్టులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు రావడం న్యాయపోరాటంలో కీలక పరిణామమని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, దశాబ్దాలుగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూముల వ్యవహారంలో, అలాగే తాజాగా మియాపూర్‌లోని 550 ఎకరాలకు సంబంధించిన వివాదంలో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు రావడం భూముల పరిరక్షణకు చేపట్టిన చర్యలకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక పర్యవేక్షణలో రెవెన్యూ శాఖ, న్యాయశాఖ, ప్రభుత్వ న్యాయవాదుల మధ్య సమన్వయం పెంచి పాత భూ రికార్డులు, రెవెన్యూ ఆధారాలు, న్యాయపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వ హక్కులను బలంగా వినిపించామని వివరించారు. ఈ విజయాల వెనుక అధికారుల సమన్వయం, న్యాయ నిపుణుల కృషి ఉందని పేర్కొంటూ, ప్రభుత్వ భూముల పరిరక్షణలో కీలక పాత్ర పోషించిన రెవెన్యూ అధికారులు, న్యాయ నిపుణులు, ప్రభుత్వ న్యాయవాదులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ భూమి రాష్ట్ర ప్రజలందరి ఉమ్మడి ఆస్తి అని, ప్రస్తుత తరంతో పాటు భవిష్యత్ తరాల ప్రయోజనాల కోసం వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఆక్రమణలకు పాల్పడినా, అక్రమంగా హక్కులు పొందేందుకు ప్రయత్నించినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కాపాడటం అంటే ప్రజల సంపదను పరిరక్షించడమేనని, ఆక్రమణలను అడ్డుకోవడంతో పాటు న్యాయస్థానాల్లోనూ ప్రభుత్వ హక్కులను సమర్థవంతంగా నిలబెట్టేందుకు చర్యలు కొనసాగిస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

జనగణన–2027 తేదీలు ఖరారు.. జనవరి 10 నుంచి స్వీయ గణనకు అవకాశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: దేశవ్యాప్తంగా జనగణన–2027 నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్‌ను ప్రకటించింది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం అక్టోబర్ 30న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ నంబర్ S.O. 5913(E) ప్రకారం, 2027 జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు ప్రజలకు స్వీయ జనగణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేసుకునే అవకాశం కల్పించనున్నారు. అనంతరం జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జనాభా వివరాలను సేకరించనున్నారు. మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు పునఃపరిశీలన ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ జనగణనకు ప్రామాణిక తేదీగా 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 00:00 గంటలను నిర్ణయించారు. అయితే మణిపూర్‌కు తదుపరి ప్రకటన వెలువడే వరకు, గోవా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, లడఖ్‌తో పాటు హిమాచల్ ప్రదేశ్, జమ్మూ–కశ్మీర్‌లోని మంచుతో కప్పబడిన కొన్ని ప్రాంతాలకు ఈ షెడ్యూల్ వర్తించదని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. మినహాయింపు పొందిన ప్రాంతాలకు సంబంధించి ప్రత్యేక షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. జనగణన ప్రక్రియలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, సరైన వివరాలు అందించాలని అధికారులు సూచిస్తున్నారు.



బీపీటీ బియ్యం కిలో గరిష్ఠ ధర రూ.66గా నిర్ణయం.. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

హైదరాబాద్, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: రాష్ట్రంలో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వినియోగదారులకు ఉపశమనం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సాధారణ ప్రజలు ఎక్కువగా వినియోగించే బీపీటీ (BPT) రకం బియ్యం గరిష్ఠ విక్రయ ధరను కిలోకు రూ.66గా నిర్ణయించినట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. మార్కెట్లో బియ్యం ధరలు పెరగడం వల్ల సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడకుండా చూడాలని ప్రభుత్వం ఈ చర్య చేపట్టినట్లు తెలిపారు. కొందరు మిల్లర్లు, వ్యాపారులు బియ్యం నిల్వలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. బియ్యం అక్రమ నిల్వలు, అధిక ధరల విక్రయాలకు సంబంధించి ఇప్పటికే 12 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఐదు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మార్కెట్లో బియ్యం లభ్యత, నిల్వలు, విక్రయ ధరలను నిరంతరం పరిశీలిస్తూ వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరను పాటించాలని, వినియోగదారుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేయకూడదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం బియ్యం నిల్వలు సరిపడా ఉన్నాయని, సరఫరాకు ఎలాంటి కొరత లేదని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రజలు అవసరానికి మించి బియ్యం కొనుగోలు చేసి నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని, మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలను ప్రభుత్వం సహించబోదని పేర్కొన్నారు. ధరల నియంత్రణ, అక్రమ నిల్వల నివారణ, వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా తనిఖీలు, పర్యవేక్షణ కొనసాగుతాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.



మహిళా కబడ్డీ విజేతలకు ట్రోఫీలు అందజేసిన మంత్రి పొంగులేటి

సత్తుపల్లి, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: సత్తుపల్లి పట్టణంలోని రాణి ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ ఛాంపియన్‌షిప్ ఫైనల్ పోటీలు, ముగింపు వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన సతీమణి మాధురితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధురి క్రీడాకారిణులతో కలిసి కబడ్డీ ఆడి వారిలో ఉత్సాహం నింపారు. రంగారెడ్డి, నల్లగొండ జట్ల మధ్య ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్ పోటీలో విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన నల్లగొండ జట్టుకు మంత్రి పొంగులేటి ట్రోఫీ అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన రంగారెడ్డి, తృతీయ స్థానంలో నిలిచిన ఖమ్మం జట్లకు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి ట్రోఫీలు అందించి క్రీడాకారిణులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటికి అతీతంగా క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవడం ముఖ్యమని అన్నారు. క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడా విధానాన్ని తీసుకొస్తోందని, క్రీడాకారులకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. టోర్నీని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, టీజీఐడీసీ మాజీ చైర్మన్ మువ్వ విజయబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, క్రీడా నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ సహా ఆరు రాష్ట్రాల్లో ఓటరు జాబితా సవరణ గడువు పొడిగింపు



भारत निर्वाचन आयोग
ELECTION COMMISSION OF INDIA

No.23/2026-ERS (Vol. II) Dated: 29th October, 2026

To,

The Chief Electoral Officer,
Telangana,
Hyderabad.

Sub: SIR of Electoral Roll w.r.t. 01.10.2026 as the qualifying date- Revised schedule-regarding.

Sir,

I am directed to refer to the Commission's letter No. 23/2023-ERS (Vol.II) dated 14.05.2026, 15.07.2026, 24.07.2026 & 07.10.2026 related to schedule of the Special Intensive Revision and your request vide letter no. 888/Elect.Edn/2026 dated 29.10.2026 and to state that the Commission has decided to revise the said schedule for Telangana as below:

Sl No	Activities	Revised schedule
1.	Notice Phase/ disposal of Claims & objection	17.08.2026 to 26.11.2026
2.	Final Publication	30.11.2026


2. All the officials/officers concerned shall be informed of the Commission's above decision and wide publicity of the modified schedule shall be made through all available media. Political Parties shall also be informed of the modified schedule in writing.

Yours faithfully,

(SANDEEP KUMAR)
UNDER SECRETARY

న్యూఢిల్లీ, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, హర్యానా, నాగాలాండ్ రాష్ట్రాలు, ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతంలో ఓటరు జాబితాల సవరణ గడువును పొడిగిస్తూ అక్టోబర్ 29న సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. తెలంగాణలో నోటీసుల జారీ, అభ్యంతరాలు, దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియను నవంబర్ 26 వరకు పొడిగించారు. ఆంధ్రప్రదేశ్, హర్యానాలో నవంబర్ 20 వరకు, నాగాలాండ్‌లో నవంబర్ 25 వరకు గడువు కల్పించారు. మహారాష్ట్రలో నవంబర్ 13 వరకు, ఢిల్లీలో నవంబర్ 25 వరకు గడువు పొడిగించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, నాగాలాండ్ రాష్ట్రాల్లో తుది ఓటరు జాబితాలను నవంబర్ 30, 2026న ప్రచురించనుండగా, ఢిల్లీలో డిసెంబర్ 22న విడుదల చేయనున్నారు. తెలంగాణకు సంబంధించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి చేసిన అభ్యర్థనను పరిశీలించిన అనంతరం ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. సవరించిన షెడ్యూల్‌ను సంబంధిత అధికారులకు తెలియజేయడంతో పాటు రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా సమాచారం అందించాలని, ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించింది. ఓటర్లు తమ పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలను ఓటరు జాబితాలో పరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్దిష్ట గడువులోగా సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలని ఎన్నికల సంఘం సూచించింది. తుది జాబితా ప్రచురణకు ముందే ఓటరు వివరాల్లో తప్పులను సరిచేసుకునేందుకు ఈ గడువు పొడిగింపు అవకాశం కల్పించనుంది.

ఖమ్మం జిల్లాలో పలువురు తహసీల్దార్ల స్థానచలనం



GOVERNMENT OF TELANGANA
PROCEEDINGS OF THE COLLECTOR & DISTRICT MAGISTRATE::KHAMMAM
PRESENT:: SRI DIVAKARA TS, I.A.S.,
IDOC Khammam – 507318

Rc. No.DCO(A)/SPR1/0001/2026 Dated:29.10.2026.

Sub: Public Servants – Ex, Br Rules – 1992 – Khammam District – Revenue Establishment – Certain Deputation of Tahsildars/Naib Tahsildars on Administrative Grounds - Orders Issued.

Read: Ariac

&&&

ORDER:

In view of administrative exigencies, the following deputations of Tahsildars/Naib Tahsildars are hereby ordered with immediate effect, as detailed below:

1. Sri Ch.Shashayji Rao, Tahsildar, Enkoor is hereby deputed to work at O/o. Sub-Collector, Kalluru.
2. Sri P.Satyanarayana, Tahsildar, Sathupalli is hereby deputed as Tahsildar, Enkoor.
3. Sri V. Ravi, Tahsildar, Mudigonda is hereby deputed as Tahsildar, Sathupalli.
4. Sri J.Balaji Prasad, Naib Tahsildar, O/o. Tahsildar, Bonakal is hereby deputed as Tahsildar (PAC), Mudigonda.
5. Sri V.Venkateshwarlu, Tahsildar, singareni is hereby deputed as Tahsildar, Bonakal.
6. Sri Ch. Sudhakar, Tahsildar, Bonakal is hereby deputed as Tahsildar, Singareni.
7. Smt. K.Laxmi, Naib Tahsildar, O/o. Tahsildar, Khammam Urban (M) is hereby deputed to work as Naib Tahsildar, O/o. RDO, Khammam.

The above Tahsildars/Naib Tahsildars are hereby directed to join at their respective places immediately and report compliance.

Sd/- Divakara TS.,
District Collector,
Khammam.

To
The Individuals
Sub-Collector, Kalluru.
RDO, Khammam

ఖమ్మం, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఖమ్మం జిల్లాలో పరిపాలనా అవసరాల దృష్ట్యా పలువురు తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లను డిప్యుటేషన్‌పై వివిధ ప్రాంతాలకు నియమిస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ దివాకర టీఎస్ ఐఏఎస్ అక్టోబర్ 29న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఎన్కూరు తహసీల్దార్ చి. శేషగిరిరావును కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు, సత్తుపల్లి తహసీల్దార్ పి. సత్యనారాయణను ఎన్కూరు తహసీల్దార్‌గా, ముదిగొండ తహసీల్దార్ వి. రవిని సత్తుపల్లి తహసీల్దార్‌గా నియమించారు. బోనకల్ తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జె. బాబ్జీ ప్రసాద్‌కు ముదిగొండ తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించారు. సింగరేణి తహసీల్దార్ వి. వెంకటేశ్వర్లును బోనకల్‌కు, బోనకల్ తహసీల్దార్ చి. సుధాకర్‌ను సింగరేణికి బదిలీ చేశారు. ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కె. లక్ష్మిని ఖమ్మం ఆర్డీఓ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌గా నియమించారు. సంబంధిత అధికారులు వెంటనే తమకు కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరి, అమలుకు సంబంధించిన నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

డిజిటల్ మోసాల్లో బ్యాంకుల నిర్లక్ష్యం ఉంటే నష్టపరిహారం తప్పదు



న్యూఢిల్లీ, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టుల పేరుతో జరుగుతున్న ఆర్థిక దోపిడీలకు అడ్డుకట్ట వేసే దిశగా సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల ఖాతాదారులు మోసపోయి డబ్బు కోల్పోతే, విచారణలో బ్యాంకుల బాధ్యత నిర్ధారణ అయిన సందర్భాల్లో బాధితులకు జరిగిన నష్టానికి సమానమైన మొత్తాన్ని పరిహారంగా చెల్లించేలా నిబంధనలు రూపొందించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం డిజిటల్ అరెస్టులు, నకిలీ పత్రాల ద్వారా జరుగుతున్న సైబర్ మోసాలపై స్వయంగా విచారణ చేపట్టిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. బ్యాంకులు కేవలం హెచ్చరికలు జారీ చేయడంతో సరిపెట్టకుండా, మోసాలను ముందుగానే గుర్తించి అడ్డుకునే పటిష్టమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. ఖాతాదారుల గత లావాదేవీల నమూనాకు భిన్నంగా అకస్మాత్తుగా భారీ మొత్తంలో నగదు బదిలీ చేయడానికి ప్రయత్నిస్తే, అలాంటి లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేసి వాటి నిజానిజాలను నిర్ధారించాలని సూచించింది. అనుమానాస్పద లావాదేవీలను స్వయంచాలకంగా గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం అందించే విధానం ఉండాలని, అవసరమైన సందర్భాల్లో ఖాతాదారులను ప్రత్యక్షంగా సంప్రదించి లావాదేవీ నిజమైనదో కాదో నిర్ధారించాలని పేర్కొంది. ఖాతాదారుల ఖాతాల స్వభావం, గత లావాదేవీల ఆధారంగా కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మోసాలను గుర్తించాలని సూచించింది. అనుమానాస్పద భారీ నగదు బదిలీల సమయంలో సమీప పోలీస్‌స్టేషన్‌కు కూడా సమాచారం చేరే విధానాన్ని పరిశీలించాలని ధర్మాసనం అభిప్రాయపడింది. వాణిజ్య సంస్థల ఖాతాల్లో భారీ లావాదేవీలు సాధారణమైనప్పటికీ, సాధారణ పొదుపు ఖాతాదారులు, విశ్రాంత ఉద్యోగుల ఖాతాల్లో అకస్మాత్తుగా పెద్ద మొత్తంలో నగదు బదిలీకి ప్రయత్నిస్తే బ్యాంకులు అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొంది. ఈ ఏడాది ఇప్పటివరకు సైబర్ నేరాల కారణంగా బాధితులు సుమారు రూ.800 కోట్లను కోల్పోయినట్లు విచారణ సందర్భంగా ప్రస్తావించింది. రిజర్వ్ బ్యాంక్ ప్రతిపాదించిన కొత్త నిబంధనల్లో బ్యాంకుల బాధ్యత, పరిహారం, నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై చర్యలకు సంబంధించి స్పష్టమైన విధానాలు ఉండాలని ఆదేశించింది. ప్రతిపాదిత నిబంధనలను నవంబర్ 30లోగా ప్రకటించి, డిసెంబర్ 31 నుంచి అమల్లోకి తీసుకురావాలని రిజర్వ్ బ్యాంక్ భావిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. తదుపరి విచారణ సందర్భంగా సంబంధిత వివరాలను సమర్పించాలని ధర్మాసనం సూచించింది. డిజిటల్ మోసాల బాధితులకు న్యాయం చేయడంతో పాటు, వారి ఖాతాల్లోని సొమ్ము మోసగాళ్ల చేతుల్లోకి వెళ్లకముందే అడ్డుకోవడమే ప్రధాన లక్ష్యమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

మెదక్ జిల్లాలో ఘనంగా జిల్లా స్థాయి కళా, సాంస్కృతిక పోటీలు.. విజేతలకు బహుమతులు అందజేసిన అదనపు కలెక్టర్ నగేష్



మెదక్, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కళా, సాంస్కృతిక పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ కళా ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. చదువుతో పాటు కళలు, సాంస్కృతిక కార్యక్రమాలపై విద్యార్థులకు ఆసక్తి పెంపొందించడం అవసరమని, ఇలాంటి పోటీలు వారిలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.. అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

నర్సాపూర్, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ శుక్రవారం డీసీహెచ్ శివ దయాలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది అందుబాటు, విధుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించి, వైద్యులు, సిబ్బంది విధులకు సమయపాలనతో హాజరై రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళికలు రూపొందించి, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ వంశీ, వైద్యులు మీర్జా, గైనకాలజిస్ట్ ప్రేమ వర్ధిని, డాక్టర్ దుర్గ, అనస్థీటిస్ట్, సివిల్ సర్జన్ రాము, వసుధ, వీణ, ప్రియదర్శిని, నర్సింగ్ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బైరన్ దిబ్బలో పత్తి రైతులను పరామర్శించిన ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్.. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్

అల్లాదుర్గం, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి): మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం బైరన్ దిబ్బ గ్రామంలో వర్షాభావ పరిస్థితులు, అధిక ఎండల కారణంగా పత్తి పంట తీవ్రంగా దెబ్బతిని నష్టాలను ఎదుర్కొంటున్న రైతులను ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పరామర్శించారు. ఈ సందర్భంగా పత్తి రైతులతో మాట్లాడి వారి సమస్యలను, పంట నష్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే గుర్తించి ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ రైతన్నల కష్టాలను ప్రభుత్వం గుర్తించి, ఎండిపోయిన పత్తి పంటకు తగిన నష్టపరిహారం అందించేలా సంబంధిత అధికారులతో మాట్లాడతామని, రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన ఎల్లప్పుడూ నిలబడేది బీఆర్ఎస్ పార్టీయేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను వివరించి, తక్షణ సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.



త్రాగునీటిని వృథా చేయవద్దు.. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పటిష్ట ప్రణాళిక రూపొందించాలి – జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

కొడిపల్లి, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో త్రాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలందరూ నీటిని పొదుపుగా వినియోగిస్తూ త్రాగునీటిని వృథా చేయవద్దని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. శుక్రవారం కొడిపల్లి మండలం ధర్మసాగర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, ఎంపీడీవోతో కలిసి గ్రామంలోని నీటి వనరుల లభ్యత, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, వి.బి.-జి. రామ్ జీ ఉపాధి హామీ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు పటిష్టమైన ప్రణాళిక రూపొందించాలని, నీటి వనరులను సంరక్షిస్తూ ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామంలో మొదటి, రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల గ్రౌండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇళ్లు మంజూరై నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి, అధికారుల సూచనల మేరకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. అలాగే వి.బి.-జి. రామ్ జీ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే వివిధ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి గ్రామీణ ప్రజలకు మరింత ఉపాధి కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, స్థానిక సర్పంచ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మానూర్‌లో బాలికలకు ఆరోగ్య పరీక్షలు.. ఆరోగ్యం, విద్య, హక్కులు, సాధికారతపై అవగాహన కార్యక్రమం



నారాయణఖేడ్, అక్టోబర్ 31(సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మానూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో భేటీ బచావో – భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యం, విద్య, హక్కులు, సాధికారతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రక్తహీనత వల్ల కలిగే సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఐసీడీఎస్ నారాయణఖేడ్ ప్రాజెక్టు సీడీపీఓ ఎల్. సుజాత మాట్లాడుతూ బాలికలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మానూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్టాలిన్ రక్తహీనత వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త గడ్డం పల్లవి మాట్లాడుతూ బాలికల హక్కులు, విద్య ప్రాముఖ్యత, సురక్షిత స్పర్శ, అసురక్షిత స్పర్శ, రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. బాలికలు తమ హక్కులను తెలుసుకొని ఆత్మవిశ్వాసంతో చదువులో రాణిస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్యనాథ్, సీహెచ్ఓ ప్రభాకర్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆర్థిక నిపుణులు పి. నర్సింలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య పర్యవేక్షకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినోపై అవగాహన ర్యాలీ.. నీటి పొదుపుపై కమిషనర్ పిలుపు



నర్సాపూర్, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని శ్రీ వత్సల్ గురుకుల విద్యాలయం ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తులో నీటి ఎద్దడి నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్య ప్రదర్శనతో పాటు ర్యాలీ చేపట్టి నీటి సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో కరువు, తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకొని వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి సంరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వైట్ల మధుసూదన్, కౌన్సిలర్ అంతారం సుధీర్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది, విద్యాలయ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



18వ రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

మెదక్, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 18వ రోజుకు చేరింది. జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కేంద్రంలో ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒకే విధమైన విధులు నిర్వహిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమ్మె కారణంగా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడటంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జరిపి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కోరారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి: మెదక్ ఎస్పీ





రామాయంపేట, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రామాయంపేటలో నిర్వహించిన రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో విధి నిర్వహణలో 14 మంది పోలీసులు అమరులయ్యారని, వారి కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందని తెలిపారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. షీ టీమ్స్, సైబర్ భద్రతపై కానిస్టేబుల్ ప్రసాద్ రచించిన పాటలను ఆవిష్కరించి అభినందించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, లయన్స్ క్లబ్, తలసేమియా సొసైటీ ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోడిఫైడ్ సైలెన్సర్లతో వాహనాలు నడిపితే కేసులు: ఎస్సై హెచ్చరిక



నర్సాపూర్ అక్టోబర్ 31(సందేశం టైమ్స్ ప్రతినిధి): మోడిఫైడ్ సైలెన్సర్లతో భారీ శబ్దాలు చేస్తూ, అతివేగంగా వాహనాలు నడిపి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నర్సాపూర్ ఎస్సై రంజిత్ రెడ్డి హెచ్చరించారు. పట్టణానికి చెందిన సిద్ధేశ్వర్ స్వామి అనే వ్యక్తి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌కు నిబంధనలకు విరుద్ధంగా మోడిఫైడ్ సైలెన్సర్ అమర్చుకుని అధిక శబ్దంతో వాహనం నడుపుతుండగా పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి మోడిఫైడ్ సైలెన్సర్ తొలగించి అసలు సైలెన్సర్ అమర్చించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత అనధికారికంగా సైలెన్సర్లు మార్చడం, అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం మానుకోవాలని సూచించారు. ఇలాంటి చర్యల వల్ల వృద్ధులు, చిన్నపిల్లలు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ఇకపై మోడిఫైడ్ సైలెన్సర్లతో పట్టుబడితే కేసులు నమోదు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.



మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

మెదక్, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, కరువు నివారణకు రూ.10 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ విడుదల చేయాలని సీపీఎం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ, కార్యదర్శివర్గ సభ్యుడు ఏ. మల్లేశం ఆధ్వర్యంలో జిల్లా ఏడీ యూనిట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ జిల్లా ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఉందని, సాగునీటి వనరులు తక్కువగా ఉండటంతో రైతులు వర్షాధార పంటలపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో జిల్లాలోని 21 మండలాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మనోహరాబాద్ మండలాన్ని మాత్రమే కరువు మండలంగా ప్రకటించడం అన్యాయమని పేర్కొన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని, ప్రతి ఎకరాకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు లేక ప్రజలు నంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు కూలీ పనుల కోసం వలస వెళ్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కరువు పరిస్థితులపై శాస్త్రీయంగా పునఃపరిశీలన చేసి జిల్లాలోని మొత్తం 21 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక అధ్యయనం చేపట్టాలని కోరారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.





నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా విడుదల: ఆర్డీఓ

మెదక్, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ ఆర్డీఓ కార్యాలయంలో 34-మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ ఆర్డీఓ, ఎన్నికల నమోదు అధికారి డాక్టర్ కె. రామాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమం పొడిగింపు, సవరించిన షెడ్యూల్‌పై వివరించారు. నోటీసుల జారీ, విచారణ, పరిష్కార ప్రక్రియ గడువును నవంబర్ 26 వరకు పొడిగించామని, తుది ఓటర్ల జాబితాను నవంబర్ 30న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 387 నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరలో పరిష్కరిస్తామని వెల్లడించారు. ఫారం-6, 6A, 7, 8 దరఖాస్తుల పరిష్కార పురోగతిని వివరించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్డీఓ కోరారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్ జోనల్ టీ20లో మెదక్ పోలీసుల సత్తా

మెదక్, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కరీంనగర్‌లో నిర్వహించిన ఇంటర్ జోనల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్‌లో మెదక్ జిల్లా పోలీస్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో సిరిసిల్ల పోలీస్ జట్టుపై 56 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విజేత జట్టును ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అభినందించి సన్మానించారు. ఈ టోర్నమెంట్‌లో మెదక్, సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల పోలీస్ జట్లు పాల్గొనగా, తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్ కెప్టెన్సీలో బరిలోకి దిగిన మెదక్ జట్టు సమష్టి కృషి, అద్భుత ఆటతీరుతో విజయాన్ని సాధించింది. మూడు మ్యాచ్‌లలో కలిపి 295 పరుగులు సాధించిన సాయి లాటికి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది. జట్టు కెప్టెన్ తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్‌తో పాటు ప్రతిభ కనబరిచిన సాయి లాటిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు పోలీసుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఐక్యత, సమష్టి కృషి వంటి లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే ఉత్సాహంతో మరిన్ని విజయాలు సాధించి మెదక్ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, సీఐలు మహేష్, వెంకట రాజా గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో వ్యక్తి మృతదేహం లభ్యం



అల్లాదుర్గం, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం కావడంతో స్థానికంగా కలకలం రేగింది. మృతుడు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వ్యక్తి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉండగా, పోలీసుల విచారణలో పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.

చింతకాని అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ప్రెస్ క్లబ్ కమిటీ







చింతకాని, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): చింతకాని మండల నూతన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు శుక్రవారం మండలంలోని వివిధ శాఖల అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షురాలు జొన్నలగడ్డ మల్లేశ్వరి, కార్యదర్శి పిచ్చయ్యతో పాటు కమిటీ సభ్యులు అధికారులను కలిసి నూతన కమిటీ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయుల బాధ్యతపై చర్చించారు. ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని నూతన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు తెలిపారు.

బోరంచ నల్లపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖ వ్యాపారవేత్తలు





మనూర్ , అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా మనూరు మండలం బోరంచ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ తల్లి దేవస్థానాన్ని హైదరాబాద్ చందానగర్‌కు చెందిన ప్రముఖ బంగారు ఆభరణాల వ్యాపార సంస్థ నత్తు అండ్ సన్స్ జువెల్లరీ నిర్వాహకులు రాజు రిజ్వానీ, రాజేష్ రిజ్వానీ, సూరజ్ రిజ్వానీ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది జాతర ఉత్సవాల నిర్వహణకు ఆలయానికి 12 బారీ గేట్లు, రెండు పెద్ద లైటింగ్ బ్యానర్లను విరాళంగా అందజేశారు. వారి సేవాభావాన్ని అభినందించిన ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులు, ఆలయ నిర్వాహకులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రతి జిల్లాలో 5 వేల వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయాలి: గిద్ది రాజేష్

సూర్యాపేట, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కనీసం 5 వేల వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను గుర్తించి తక్షణమే భర్తీ చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గిద్ది రాజేష్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. శుక్రవారం తెలంగాణ మహిళా సాధికారిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర వికలాంగుల డైరెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వికలాంగుల పింఛన్‌ను నెలకు రూ.6 వేలకు పెంచుతామని, రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం-2016ను సమర్థవంతంగా అమలు చేస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా హామీలు అమలుకు నోచుకోలేదని ఆయన విమర్శించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం వికలాంగులకు ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను గుర్తించి ప్రత్యేక నోటిఫికేషన్ల ద్వారా బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, అర్హులైన వికలాంగ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వికలాంగుల కోసం ప్రత్యేక సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాలని, వికలాంగుడైన వ్యక్తినే రాష్ట్ర వికలాంగుల కమిషనర్‌గా నియమించాలని, చట్టబద్ధమైన రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేయాలని, స్థానిక సంస్థల్లో వికలాంగులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చకపోతే కొడంగల్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా వికలాంగులను సమీకరించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్రవ్యాప్త పోరాటం చేపడతామని గిద్ది రాజేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ దివ్యాంగ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నేటి రాశి ఫలాలు – అక్టోబర్ 31, 2026

మేషం: వ్యాపారాల్లో ఆశించిన ఫలితాలు సాధిస్తారు. వృత్తి, ఉద్యోగాల్లో కీలక నిర్ణయాలను అమలు చేస్తారు. అవసరమైన సమయంలో సన్నిహితుల నుంచి ఆర్థిక సహాయం అందుతుంది. రాజకీయ ప్రముఖుల నుంచి ఆహ్వానాలు లభిస్తాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి.

వృషభం: ఉద్యోగస్తులకు పని ఒత్తిడి అధికమవుతుంది. వ్యాపారాల్లో తొందరపాటు నిర్ణయాలకు దూరంగా ఉండాలి. కుటుంబ సభ్యులతో అభిప్రాయ భేదాలు తలెత్తవచ్చు. చేపట్టిన పనులు శ్రమతో పూర్తవుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో కొంత గందరగోళం ఎదురవుతుంది. అనవసర ప్రయాణాలు చేయాల్సి రావచ్చు.

మిథునం: బంధుమిత్రులతో స్వల్ప వివాదాలు ఏర్పడవచ్చు. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాల్లో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ఉద్యోగస్తులకు అధికారులతో జరిపే చర్చలు ఆశించిన ఫలితాలనివ్వవు. దూర ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిది. నూతన వ్యాపారాల ప్రారంభ ప్రయత్నాలు అనుకూలించవు.

కర్కాటకం: విద్యార్థులు తమ కష్టానికి తగిన ఫలితాలు పొందుతారు. జీవిత భాగస్వామి సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తిచేస్తారు. వృత్తి, వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుకుంటారు. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రుల నుంచి విలువైన బహుమతులు అందుకుంటారు.

సింహం: మిత్రులతో విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. వృత్తి, ఉద్యోగాల్లో పదోన్నతులకు అవకాశాలు లభిస్తాయి. చిన్ననాటి మిత్రులతో ఆనందంగా గడుపుతారు. నూతన పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. చేపట్టిన పనుల్లో కార్యసిద్ధి కలుగుతుంది.

కన్య: ఉద్యోగ ప్రయత్నాలు వాయిదా పడవచ్చు. అనవసర ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండాలి. ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు అవసరం. అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉండక ఇబ్బందులు ఎదురవుతాయి. పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి, వ్యాపారాల్లో స్వల్ప లాభాలు పొందుతారు.

తుల: ఉద్యోగ విషయాల్లో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. మాతృవర్గ బంధువులతో వివాదాలు ఏర్పడవచ్చు. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదాయ మార్గాలు మందగిస్తాయి. ఆరోగ్యంపై అశ్రద్ధ చేయకూడదు. పాత మిత్రుల నుంచి అందే సమాచారం కొంత ఊరటనిస్తుంది.

వృశ్చికం: ఇంట్లో శుభకార్యాల నిర్వహణపై చర్చలు జరుగుతాయి. దీర్ఘకాలిక రుణ సమస్యల నుంచి కొంత ఉపశమనం లభిస్తుంది. వృత్తి, ఉద్యోగాల్లో పనితీరుతో అందరినీ ఆకట్టుకుంటారు. ఆప్తుల నుంచి శుభవార్తలు అందుతాయి. నూతన వస్తువులు, వాహనాలు కొనుగోలు చేస్తారు. బంధుమిత్రులతో కలిసి పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు.

ధనుస్సు: వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఆశించిన ఫలితాలనివ్వవు. జీవిత భాగస్వామితో స్వల్ప వివాదాలు ఏర్పడవచ్చు. ఉద్యోగస్తులకు అదనపు పని భారం పెరుగుతుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో ఆటంకాలు ఎదురవుతాయి. కుటుంబ పెద్దల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

మకరం: నూతన వ్యాపారాల ప్రారంభం ద్వారా తగిన లాభాలు పొందుతారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. వృత్తి, ఉద్యోగాలు అనుకూలిస్తాయి. నిరుద్యోగులకు అరుదైన అవకాశాలు లభిస్తాయి. సన్నిహితులతో కలిసి ఇంట్లో సంతోషంగా గడుపుతారు. చేపట్టిన పనుల్లో అనుకోని విజయాలు సాధిస్తారు.

కుంభం: ఉద్యోగాల్లో సహోద్యోగుల నుంచి విమర్శలు ఎదురవుతాయి. అనారోగ్య సమస్యలు బాధించవచ్చు. కొత్త రుణ ప్రయత్నాలు ఫలించవు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటాయి. ఆకస్మిక ప్రయాణాలు చేయాల్సి రావచ్చు. దూరపు బంధువులతో అభిప్రాయ భేదాలు ఏర్పడవచ్చు.

మీనం: స్థిరాస్తి క్రయవిక్రయాల్లో లాభాలు పొందుతారు. సంతానం వివాహ విషయమై ఇంట్లో చర్చలు జరుగుతాయి. విలువైన వస్తువులు, వాహనాలు బహుమతులుగా అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి గతంతో పోలిస్తే మెరుగుపడుతుంది. నూతన వస్తు లాభాలు కలుగుతాయి. నిరుద్యోగుల ఆశలు నెరవేరుతాయి.

గమనిక: ఇవి సంప్రదాయ జ్యోతిష్య నమ్మకాల ఆధారంగా రూపొందించిన సాధారణ రాశి ఫలితాలు మాత్రమే. వ్యక్తిగత జాతకాన్ని బట్టి ఫలితాలు మారవచ్చు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఢిల్లీకి బయలుదేరిన అందోల్ నియోజకవర్గ కాంగ్రెస్ మండల అధ్యక్షులు



సంగారెడ్డి, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి కాంగ్రెస్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అందోల్ నియోజకవర్గానికి చెందిన నూతన మండల అధ్యక్షులు ఢిల్లీకి బయలుదేరారు. వారితో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య కూడా పయనమయ్యారు. ఢిల్లీకి బయలుదేరిన వారిలో వట్‌పల్లి మండల అధ్యక్షుడు వజినాల విశ్వాస్, అందోల్ మండల అధ్యక్షుడు గంగాధర్ అశోక్, మునిపల్లి మండల అధ్యక్షుడు లింగన్నగారి సతీష్ కుమార్, చౌటకూర్ మండల అధ్యక్షుడు బోడపట్ల గణేష్, పుల్కల్ మండల అధ్యక్షుడు మల్లన్నగారి దుర్గారెడ్డి, రాయికోడ్ మండల అధ్యక్షుడు పట్లోళ్ల కేదారినాథ్ పాటిల్, అందోల్-జోగిపేట పట్టణ అధ్యక్షుడు డి.జి. వెంకటేశం తదితర జిల్లా, మండల నాయకులు ఉన్నారు.

రామారావు హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.. భట్టి విక్రమార్కపై ఆరోపణలు సరికాదు: మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి



చింతకాని, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): శవ రాజకీయాలు, చిల్లర రాజకీయాలు చేయడం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నైజం కాదని మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామంలో మాజీ ఎంపీటీసీ బొర్ర ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఏడాది పాతర్లపాడు గ్రామంలో సీపీఎం రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సామినేని రామారావు హత్యకు గురైన ఘటనలో నిందితులను పట్టుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకులతో పాటు కాంగ్రెస్ జిల్లా నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారని, పలు ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పోలీసు ఉన్నతాధికారులతో కేసును సమగ్రంగా దర్యాప్తు చేయించాలని ఆదేశించారని, పోలీసులు వివిధ కోణాల్లో విచారణ జరిపి, ఫోరెన్సిక్ సైన్స్ అండ్ టెక్నాలజీ ల్యాబొరేటరీ సహకారంతో నిందితులను గుర్తించి అరెస్టు చేశారని పేర్కొన్నారు. విచారణలో నిందితులకు సీపీఎం నాయకులతో సంబంధాలు ఉన్నట్లు తేలిన నేపథ్యంలో, కేసును పక్కదారి పట్టించేలా భట్టి విక్రమార్కే హత్య చేయించారని, అమాయకులను పోలీసులు అరెస్టు చేశారని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసుల దర్యాప్తులో అరెస్టయిన నిందితులు తెల్దారుపల్లికి చెందిన తమ్మినేని వీరభద్రం అనుచరులని, వారికి గతంలో పలు కేసుల్లో నేరచరిత్ర ఉందని అంబటి ఆరోపించారు. సొంత పార్టీకి చెందిన నాయకుడైన రామారావు హత్య ఘటనపై రాజకీయాలు చేయకుండా, చట్టం తన పని తాను చేసుకునేలా సహకరించాలని సూచించారు. నిజాయితీ, నిస్వార్థంగా పనిచేసిన రామారావు వంటి నాయకుడి హత్యకు సంబంధించిన నిందను గ్రామంలోని అమాయకులపై వేయడం ఆయన ఆత్మను క్షోభకు గురిచేస్తుందని అన్నారు. గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలకు తావులేకుండా అభివృద్ధికి సహకరించాలని, భట్టి విక్రమార్కపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని కోరారు. చట్టం ఎవరినీ వదిలిపెట్టదని, నేరం చేసిన వారు ఎంతటివారైనా శిక్షకు గురవుతారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మడిపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, కూరపాటి కిషోర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున, పెంట్యాల అప్పారావు, సర్పంచులు కిలారి మనోహర్, ఆవుల నాగేశ్వరరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు బొర్ర శేషగిరిరావు, మండల నాయకుడు కాండ్ర పిచ్చయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంచుమర్తి రామకృష్ణ, తాళ్లూరి బాలాజీ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొడిపల్లిలో పట్టపగలే చోరీకి యత్నం.. దొంగను పట్టుకున్న స్థానికులు

కొడిపల్లి, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా కొడిపల్లి మండల కేంద్రంలోని మల్లికార్జున కాలనీలో పట్టపగలే ఓ ఇంట్లో చోరీకి యత్నించిన వ్యక్తిని స్థానికులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాలనీకి చెందిన బుర్జీగాడి బుమయ్య కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన సమయంలో, ఇంట్లో ఎవరూ లేరని గమనించిన ఓ వ్యక్తి ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించాడు. అనంతరం బీరువా తాళం కూడా పగలగొట్టి అందులోని వస్తువులు, నగదు, ఆభరణాలు అపహరించేందుకు ప్రయత్నిస్తుండగా, అదే సమయంలో ఇంటికి చేరుకున్న బుమయ్య కుమారుడు గోపాల్‌కు అనుమానాస్పద శబ్దాలు వినిపించాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలగొడుతున్న వ్యక్తిని గుర్తించి వెంటనే చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని అతడిని పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పట్టుబడిన వ్యక్తి గతంలో ఇతర ప్రాంతాల్లోనూ చోరీలకు పాల్పడి ఉండవచ్చని, అతని వద్ద కొన్ని ఆభరణాలు ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడి గుర్తింపు, ఆభరణాల వివరాలు, ఇతర చోరీలతో సంబంధం వంటి అంశాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఈ ఘటనతో కొడిపల్లి మండల కేంద్రంలో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.



మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది

సూర్యాపేట, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): ప్రజా ప్రభుత్వంలో సూర్యాపేట పట్టణంలోని అన్ని వార్డుల్లో సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమానంగా అమలు చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. శుక్రవారం పట్టణంలోని నాలుగో వార్డు నేత్యా తండాలో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ డ్రైన్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాలుగో వార్డుకు 21 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, వాటి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వార్డులో బోర్‌వెల్‌తో పాటు పైపులైన్ నిర్మాణ పనులకు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని చెప్పారు. అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు అనే తేడా లేకుండా అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, సూర్యాపేట మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బుక్యా జ్యోతి లింగ నాయక్, ఏఈ తిరుమలయ్య, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రముఖులు వాజిద్ మియా, సలీం ఆఫ్ ఖాన్, శ్రీనివాసరెడ్డి, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల అరెస్ట్.. రూ.4 లక్షల విలువైన బంగారం గుర్తింపు: ఎస్పీ కె. నరసింహ

సూర్యాపేట, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కిరాణా దుకాణాల్లో మహిళలు ఒంటరిగా ఉన్న సమయాన్ని ఆసరాగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ తెలిపారు. గురువారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసుల వివరాలను వెల్లడిస్తూ, నిందితుల వద్ద నుంచి సుమారు రూ.4 లక్షల విలువైన బంగారాన్ని గుర్తించామని, దానిని ఖమ్మం పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో కుదువ పెట్టినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. నిందితులను ఖమ్మం జిల్లాకు చెందిన షేక్ ఖాసీం అలియాస్ షన్ను (23), తుమ్మాటి భరత్ కుమార్ అలియాస్ భరత్ (24)గా గుర్తించామని, వీరిలో ఖాసీం కార్ డెకరేటర్‌గా, భరత్ ప్రైవేట్ ఆసుపత్రిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారని వివరించారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 6.45 గంటల సమయంలో సూర్యాపేట పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఓ కిరాణా దుకాణంలో మహిళ ఒంటరిగా ఉన్న సమయంలో సిగరెట్, వాటర్ బాటిల్, సెంటర్ ఫ్రెష్ కావాలని అడిగి, ఆమె వాటిని ఇచ్చే పనిలో ఉండగా మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కొని మోటార్ సైకిల్‌పై పరారయ్యారని తెలిపారు. ఇదే తరహాలో ఈ నెల 11వ తేదీన కోదాడ పట్టణంలోని ఓ కిరాణా దుకాణంలో మహిళ మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ ఘటనలపై సూర్యాపేట రెండో పట్టణ, కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించిన పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారని, అక్టోబర్ 29న ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా రెండు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు అంగీకరించారని తెలిపారు. నిందితులపై గతంలో గంజాయి, దొంగతనం కేసులు ఉన్నట్లు వెల్లడైందని చెప్పారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని, పదేపదే నేరాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై జిల్లా బహిష్కరణ, రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్లు, పీడీ యాక్ట్ వంటి చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఎస్పీ హెచ్చరించారు. ముఖ్యంగా దుకాణాలు నిర్వహించే మహిళలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు విస్తృతంగా చేపట్టామని, నేరాల ఛేదనలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని, ప్రజలు కూడా తమ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ రెండు కేసులను ఛేదించడంలో కృషి చేసిన పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐ కె. గోపికృష్ణ, రామనరసయ్య, శ్రీరాములు, కొండ రమేష్, నవీన్‌లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ వెంకటయ్య, ఎస్ఐలు సందీప్, కనకరత్నం, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి: శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు నవంబర్ 6 చివరి తేదీ అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2026 నవంబర్ 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తామని, 2023 అక్టోబర్ 31 నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని వివరించారు. తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రత్యక్షంగా దరఖాస్తు చేసుకునేవారు ఫారం-18తో పాటు విద్యార్హత ధ్రువపత్రాలను సంబంధిత సహాయ ఎన్నికల నమోదు అధికారి లేదా నియమిత అధికారి కార్యాలయాల్లో సమర్పించవచ్చని తెలిపారు. పోస్టు ద్వారా కూడా దరఖాస్తులు పంపేందుకు అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్‌లో అయినా, ప్రత్యక్షంగా అయినా దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు అవసరమైన ఇతర పత్రాలను తప్పనిసరిగా జతచేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో అర్హులైన పట్టభద్రులెవరూ ఓటరు నమోదుకు దూరం కాకుండా రాజకీయ పార్టీలు, పట్టభద్రుల సంఘాలు, విద్యాసంస్థలు, ఉద్యోగ సంఘాలు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. అందిన దరఖాస్తులను అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హమైన వాటిని పరిష్కరిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తులకు సంబంధించి సందేహాలు, అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఉంటే సంబంధిత ఎన్నికల నమోదు అధికారి లేదా సహాయ ఎన్నికల నమోదు అధికారి కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీ నిరసన కార్యక్రమానికి వెళుతున్న అందోల్ నియోజకవర్గ మండలాధ్యక్షులకు ఉద్యమాభివందనాలు: కచూర్ రావు



వట్పల్లి మండల్ అక్టోబర్ 31సందేశం టైమ్స్ ప్రతినిధి సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ మండలాధ్యక్షులకు నమస్కారములు తెలియజేస్తూ, దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న భారీ నిరసన కార్యక్రమానికి ప్రజల మేలు కోరే ఉద్యమ స్ఫూర్తితో, యువతర ఆలోచనలతో ముందుకు సాగుతున్న గౌరవనీయ మండలాధ్యక్షులకు ఉద్యమాభివందనాలు తెలియజేస్తున్నానని రాయికోడ్ ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు అన్నారు. అన్యాయాలను నిలదీసి ప్రశ్నించే గుణం, హక్కుల సాధన కోసం జరిగే పోరాటాల్లో ముందువరుసలో నిలిచే మీరంతా ఢిల్లీలో చేపట్టిన కార్యక్రమంలో విజయం సాధించి తిరిగి రావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.



2028లో తెలంగాణలో బీసీ రాజ్యాధికారమే లక్ష్యం: తీన్మార్ మల్లన్న

మిర్యాలగూడ, అక్టోబర్ 31 – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణలో బీసీలకు రాజకీయ అధికారమే లక్ష్యంగా బీసీ రాజ్యాధికార యాత్ర కొనసాగుతోందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు. 2028లో తెలంగాణలో బీసీ రాజ్యాధికారాన్ని సాధించడమే తమ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. సెప్టెంబర్ 17న గోల్కొండ కోట నుంచి ప్రారంభమైన ఆయన పాదయాత్ర 38వ రోజుకు చేరుకుని 1,000 కిలోమీటర్ల మైలురాయిని పూర్తి చేసుకుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మీదుగా నల్లగొండ జిల్లాలోకి ప్రవేశించిన యాత్ర శనివారం మిర్యాలగూడ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక పార్టీ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు తీన్మార్ మల్లన్నకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో నల్లగొండ జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు వైద్యం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మల్లన్న ప్రసంగిస్తూ గత ఎనిమిది దశాబ్దాలుగా బీసీలకు రాజకీయంగా సరైన ప్రాతినిధ్యం దక్కలేదని ఆరోపించారు. జనాభాలో గణనీయమైన వాటా కలిగిన బీసీలకు రాజకీయ అధికారంలో తగిన భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రెడ్లు, వెలమల ఆధిపత్య రాజకీయాలకు ముగింపు పలికి బీసీలకు రాజ్యాధికారం సాధించడమే తమ ఉద్యమ లక్ష్యమని పేర్కొన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేసిన మల్లన్న, బీసీలను, బీసీ ఉద్యోగులను వేధిస్తున్నారంటూ విమర్శించారు. బీసీ నాయకుడు తమ్మడబోయిన అర్జున్‌తో పాటు బీసీ ఉద్యోగులపై కేసులు నమోదు చేయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గతంలో అర్జున్‌ను తన వద్దకు తీసుకువచ్చిన సందర్భంలోనే ఆయన వ్యవహారశైలిపై హెచ్చరించినట్లు గుర్తుచేశారు. బీసీ ఉద్యోగులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, వారి హక్కుల పరిరక్షణకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బీసీల జోలికి వస్తే సహించేది లేదని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని ఉద్దేశించి హెచ్చరించారు. రాబోయే రోజుల్లో మిర్యాలగూడ నియోజకవర్గంలో బీసీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటించారు. బీసీ కులాలన్నీ పరస్పర విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, విద్య, ఉపాధి అవకాశాల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరుస్తూ బీసీ రాజ్యాధికార యాత్ర కొనసాగిస్తామని తీన్మార్ మల్లన్న తెలిపారు.

మాక్ పార్లమెంట్‌లో మెదక్ విద్యార్థినికి రాష్ట్రస్థాయి ప్రథమ స్థానం




మెదక్, అక్టోబరు 31 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ పోటీల్లో మెదక్ జిల్లా శంకరంపేట మోడల్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని బి. ఆర్తి చంద్ర ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి మొత్తం 66 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో టీజీఎంఎస్ శంకరంపేట-ఆర్ పాఠశాల తరఫున పాల్గొన్న ఆర్తి చంద్ర డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరిస్తూ తన ప్రతిభను చాటుకున్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎంపికై రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతిని అందుకున్నారు. రాష్ట్రస్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్ చేతుల మీదుగా ఆర్తి చంద్ర అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రాజు విద్యార్థిని ఆర్తి చంద్రను ప్రత్యేకంగా అభినందించారు. ఆమెకు మార్గదర్శకత్వం వహించిన గైడ్ టీచర్ లింగమయ్య (పీజీటీ), పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు సహకరించిన సోషల్ ఫోరం బాధ్యులు నర్సింలు, రవిబాబులను ప్రశంసించారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, విద్యార్థిని కృషి, పట్టుదలతో రాష్ట్రస్థాయిలో ఈ ఘనత సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు దేశ ప్రజలకు మరువలేనివి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్

నర్సాపూర్, అక్టోబరు 31 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ప్రతినిధి): సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలు, దేశ సమైక్యత కోసం ఆయన అందించిన కృషి భారత ప్రజలకు ఎప్పటికీ మరువలేనివని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్ అన్నారు. నర్సాపూర్ పట్టణంలోని బీజేపీ అసెంబ్లీ పార్టీ కార్యాలయంలో పట్టణ కన్వీనర్ ప్రేమ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వల్దాస్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని అనేక సంస్థానాలను ఏకం చేసి భారతదేశానికి సమైక్య రూపాన్ని తీసుకురావడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన దూరదృష్టి, నాయకత్వ లక్షణాలు, దేశ సమగ్రత కోసం చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పటేల్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశ అభ్యున్నతి, ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు రమేష్ గౌడ్, దిశా కమిటీ సభ్యులు పెద్ద రమేష్ గౌడ్, బోడ పద్మ, రామచంద్రాపూర్ ఉపసర్పంచ్ వినోద్, శివ, బీజేపీ నాయకులు శ్రీనివాస్, గోడేల రాణి, బీజేవైఎం నాయకులు బిక్షపతి, చిగురు రాజు తదితరులు పాల్గొన్నారు.



బంగాళాఖాతంలో వాయుగుండం.. నవంబర్ 1న 'మురసు' తుఫాన్‌గా మారే అవకాశం

హైదరాబాద్, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ కోఆర్డినేటర్ సురేష్ రాజ్): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి నవంబర్ 1వ తేదీన తుఫాన్‌గా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. తుఫాన్‌గా మారితే దీనికి 'మురసు' అనే పేరు పెట్టనున్నారు. అక్టోబర్ 31 సాయంత్రం 5.30 గంటల సమయానికి ఈ వాయుగుండం ఆగ్నేయ బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉందని, చెన్నైకి సుమారు 960 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 980 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 1,030 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు ఐఎండీ బులెటిన్‌లో పేర్కొంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ తొలుత తీవ్ర వాయుగుండంగా, నవంబర్ 1న తుఫాన్‌గా, నవంబర్ 2న తీవ్ర తుఫాన్‌గా బలపడే అవకాశం ఉందని అంచనా వేసింది. నవంబర్ 3వ తేదీ తెల్లవారుజామున దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంలోకి చేరుకుని, నెల్లూరు–నరసాపురం మధ్య తీరాన్ని దాటే అవకాశముందని వాతావరణ శాఖ ప్రస్తుత అంచనాలు సూచిస్తున్నాయి. ఈ వ్యవస్థ ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో కోస్తాంధ్రలోని పలు ప్రాంతాలు, యానాంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాయలసీమలోనూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయి. సముద్రం అలజడిగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. తీరప్రాంత ప్రజలు వాతావరణ శాఖ, జిల్లా యంత్రాంగం జారీ చేసే తాజా సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జిల్లా పోలీస్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా యంగ్ స్టార్ జట్టు



నర్సాపూర్, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా పోలీస్ క్రికెట్ టోర్నమెంట్‌లో యంగ్ స్టార్ జట్టు విజేతగా నిలిచింది. శనివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో సహారా ఇండియన్స్, యంగ్ స్టార్ జట్లు తలపడగా, ఉత్కంఠభరితంగా సాగిన పోటీలో యంగ్ స్టార్ జట్టు విజయం సాధించింది. అనంతరం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి మెదక్ జిల్లా అదనపు ఎస్పీ వికాంత్ సింగ్, డీఎస్పీ నరేందర్ గౌడ్, నర్సాపూర్ సీఐ రంగకృష్ణ, ఎస్ఐ రంజిత్ రెడ్డి హాజరై విజేత, రన్నరప్ జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ వికాంత్ సింగ్ మాట్లాడుతూ యువత మత్తు పానీయాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన కోసం క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. క్రీడలు యువతలో ఐక్యత, క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువత క్రీడలు, విద్యతో పాటు ఇతర రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుకుంటూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరు జట్ల క్రీడాకారులు, నర్సాపూర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారులకు సత్వరమే న్యాయం అందించాలి: హైకోర్టు న్యాయమూర్తి గాడి ప్రవీణ్ కుమార్



నర్సాపూర్, అక్టోబర్ 31 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ప్రతినిధి): కక్షిదారులకు సత్వర న్యాయం అందించడంతో పాటు న్యాయవ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా న్యాయవాదులు తమ విధులు నిర్వర్తించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి గాడి ప్రవీణ్ కుమార్ సూచించారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోర్టు ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు అధికారులు, న్యాయవాదులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి నూతన కోర్టును ప్రారంభించారు. కోర్టు ప్రాంగణంలో మొక్క నాటి నీరు పోసిన అనంతరం సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరూ న్యాయధర్మాన్ని పాటిస్తూ, అన్యాయాన్ని సహించకుండా కక్షిదారులకు నిష్పక్షపాతంగా న్యాయం అందించేందుకు కృషి చేయాలని అన్నారు. బార్ అసోసియేషన్, బెంచ్ మధ్య అన్నదమ్ముల అనుబంధం కొనసాగాలని, పరస్పర గౌరవం, సమన్వయంతో న్యాయవ్యవస్థ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. డ్రైవర్లు డ్రెస్ కోడ్ పాటిస్తూ క్రమశిక్షణతో వ్యవహరించాలని పేర్కొన్నారు. జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా ఒదిగి ఉండాలని, అమ్మను మించిన గురువు ఎవరూ లేరని అన్నారు. కక్షిదారుల సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తూ వారికి న్యాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి నీలిమ మాట్లాడుతూ నర్సాపూర్ పరిసర ప్రాంత ప్రజలకు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు అందుబాటులోకి రావడం వల్ల న్యాయసేవలు మరింత చేరువవుతాయని, సత్వర న్యాయం పొందేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. జిల్లాలోని కోర్టు ప్రాంగణాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి కక్షిదారులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా తక్కువ ధరకు భోజన సదుపాయం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి గాడి ప్రవీణ్ కుమార్‌ను జిల్లా న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు మెమెంటో అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ వికాంత్ కుమార్ సింగ్, అదనపు జిల్లా సెషన్స్ జడ్జి శుభవల్లి, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రూబీనా ఫాతిమా, మొబైల్ కోర్టు న్యాయమూర్తి సాయి ప్రభాకర్, అల్లాదుర్గం జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. హేమలత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, బార్ అసోసియేషన్ సభ్యులు, వివిధ న్యాయవాద సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.